## అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

**ఘట్‌కేసర్, అక్టోబర్ 23, ప్రభాతవార్త:** అనుమానాస్పదస్థితిలో గాయాలై ఓవ్యక్తి భవనం ముందు పడి ఉండగా ఆసుపత్రిలో చేర్పించడంతో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధలో చోటుచేసుకుంది. పోచారం మున్సిపల్ అన్నోజీగూడ రాజీవ్‌గృహకల్పకాలనీకి చెందిన ఎలక్ట్రిషియన్ అర్ర నరేశ్ (29) ఈనెల 22న సాయంత్రం 6 గంటలకు తన స్నేహితుని పుట్టిన రోజు వేడుకలకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలు దేరాడు. రాత్రి ఇంటికి రాకపోగా శనివారం అర్ధరాత్రి దాటాక ఆర్‌జికెకాలనీలోని 18 నంబర్ బ్లాక్ భవనం ముందు రక్త గాయాలతో పడి ఉండగా అతని స్నేహితుడు గమనించి అతని తల్లికి సమాచారం ఇవ్వగా ఆమె స్థానికులతో కలిసి నరేశ్‌ను గాంధీ ఆసుపత్రికి తరలించింది. కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం 7:19 గంటలకు మృతిచెందాడని నరేశ్ తల్లి లక్ష్మి ఘట్‌కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఘట్‌కేసర్ సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. ప్రమాదవశాత్తు భవనంపై నుంచి కింద పడ్డాడా లేక ఎవరైనా దాడి చేసి గాయపరిచారనే అనే కోణంలో పోలీసులు దర్యాప్తు జరు పుతున్నట్లు సమాచారం.




## దీపావళి పండుగ ప్రజల జీవితాల్లో వెలుగు నింపుతుంది : కలెక్టర్

**అక్టోబరు 23, ప్రభాతవార్త:** దీపావళి పండుగ ప్రజల జీవితాల్లో వెలుగు నింపుతుందని, ఆ పండుగను ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ హరీశ్ సూచించారు. మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. దీపావళి పర్వదినాన్ని జిల్లాలోని ప్రజలందరూ ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని, ఈ పండగ ప్రజల జీవితాల్లో మంచిని తీసుకరావటంతో పాటు వారి జీవితాల్లో వెలుగులు నింపాలని కలెక్టర్ ఆకాంక్షను వ్యక్తం చేశారు. సోమవారం దీపావళి పండుగ సందర్భంగ జిల్లా ప్రజలతో పాటు అధికా రులకు, ప్రజా ప్రతినిధులకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై మంచి ఎపుడు విజయం సాధిస్తునే ఉంటుందని, ప్రతి ఒక్కరు ఎవరికి చెడు తలపెట్టకుండ మంచిని కోరుకోవాలని ఆయన సూచించారు. ఏకాలంలోనైనా ఎప్పటికి చెడుకు తావు ఉండదని మంచి చేసే వారికి దైవం కూడ సహ కరిస్తుందన్నారు. దీపావళి పండుగను ఎలాంటి ప్రమాదాలు జరగకుండ ప్రభుత్వం సూచించిన విధంగ ఆనందంగ దీపావళి పండుగను జరుపుకోవాలని కలెక్టర్ హరీశ్ సూచించారు.

# నిబంధనలు డాం.. పర్యవేక్షణ తుస్..

**- అనుమతులు లేకుండానే విచ్చలవిడిగా బాణసంచా అమ్మకాలు**
**- షాద్‌నగర్‌లో భారీగా దుకాణాలు**
**- పట్టించుకోని అధికార యంత్రాంగం**



బాణ సంచాల అమ్మకాలు జరుపుతున్న దుకాణదారులు

**షాద్‌నగర్, అక్టోబర్ 23 , (ప్రభాతవార్త) :** ప్రమాదకరమైన బాణ సంచాలు అమ్మాలంటే ప్రభుత్వ అనుమతులు ఉండాలి... నిబంధ నలు పాటించాలి... కానీ అలాంటివేవీ ఇక్కడ కొంత మంది వ్యాపా రులకు వర్తించవు... ఎక్కడైనా అమ్ముకోవచ్చు... ఎంతైనా ధర పెట్టుకోవచ్చు... నిబంధనలు వాళ్లకు గిట్టవు... ఇవేవీ సంబంధిత అధికారులకు పట్టవు... దీపావళి సందర్భంగా అమ్మే బాణసంచాకు సంబంధించి షాద్‌నగర్ పట్టణంలో నెలకొన్న పరిస్థితి ఇది.

### సాగుతుంది ఇలా...

షాద్‌నగర్ పట్టణంలో బాణసంచా అమ్మకాలకు సంబంధించి కేవలం 14 మందికి మాత్రమే ప్రభుత్వ అనుమతులు ఉన్నాయి... నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకున్న వ్యక్తులు తమ వ్యాపారం కొనసాగించాలి... కానీ ఒకే అనుమతితో కొందరు రెండు మూడు చోట్ల దుకాణాలు ఏర్పాటు చేసుకుంటూ ఎదేచ్ఛగా వ్యాపారాలు కొనసాగుతున్నారు. ఇక మరోవైపు ఎలాంటి అనుమతులు లేకుండానే బాణసంచాలు అమ్ముతూ మూడు పూలు ఆరు కాయలు అన్న చందంగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. ముఖ్యంగా జన సంచారం లేని ప్రాంతాలలో మాత్రమే పూర్తిస్థాయి రక్షణ చర్యలతో వీటిని అమ్మాల్సి ఉంటుంది. కానీ వ్యాపారులు ఈ నిబంధనలలో ఒక్కటి కూడా పాటించడం లేదు. పొరపాటున ఏదైనా ప్రమాదం జరిగిందంటే తమ షాపుతో పాటు చుట్టు పక్కల ఉన్న దుకాణాలు కూడా కాలి బూడిద అయిపోతాయి. అందుకే అమ్మకాలకు ప్రత్యేక అనుమతులు పెట్టడమే కాకుండా, దీనిని పర్యావేక్షిచే బాధ్యత అధికారులకు అప్పగించింది ప్రభుత్వం. దాదాపు వారం రోజులుగా పట్టణంలో బాణసంచా అమ్మకాలు జరుగుతున్నాయి. క్రమక్రమంగా పెంచుతూ వివిధ కాలనీల్లో సహితం విక్రయాలు కొనసాగుతున్నారు. వీటిని పర్యావేక్షించి అనుమతులను పరిశీలించాల్సిన అధికారులు మాత్రం చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. చిన్న చిన్న కాలనీల్లో సహితం బాణ సంచాలు అమ్మకాల దుకాణాలను ఏర్పాటు చేసి క్రయవిక్రయాలు చేస్తున్నారు. ఒకవేళ కాలనీ వాసులు బాణసంచా కాల్చేటప్పుడు రాకెట్ లాంటి కొన్ని పటాకులు వాటిపై పడితే పెద్ద ఎత్తున ప్రమాదం చోటు చేసుకునే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకొని అధికారులు విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్న దుకాణాలపై నియంత్రణ విధించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



టపాసులు (ఫైల్)

### తస్మాత్ జాగ్రత్త...

దీపావళికి ప్రతి ఒక్కరూ ఆనందంగా కాల్చే బాణసంచా ఎంత సరదానో అంత ప్రమాదకరం కూడా... అందుకే వీటిని కాల్చేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, మహిళలు బాణసంచా కాల్చేటప్పుడు అతి జాగ్రత్తగా వ్యవహరించాలి. చిన్న చిన్న గుడిసెలు, ఎండు గడ్డి ఉన్నచోట బాణసంచా పేల్చడం ప్రమాదకరం. పెద్ద పెద్ద బాంబులు, భారీ శబ్దాలు వచ్చే టపాసులు పేల్చకపోవడమే మంచిది. ఎందుకంటే గుండె బలహీనతలు ఉన్న వారికి ఇది ప్రమాదకరం. చిన్న పిల్లలు కూడా భయపడే అవకాశం ఉంటుంది, టపాసుల దుకాణాలు ఉన్న ప్రాంతాలలో, పెట్రోల్ బంకులు ఉన్న చోట బాణసంచా కాల్చడం ప్రమాదకరం. ఇలాంటి జాగ్రత్తలన్నీ పాటిస్తూ ప్రమాదరహితంగా ప్రతి ఒక్కరూ దీపావళి పండుగను సంతోషంగా జరుపుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కేంద్రమంత్రి కిషన్ రెడ్డితో కలిసి ప్రచారంలో పాల్గొన్న రాజు భూపాల్ గౌడ్

## కేంద్రమంత్రి కిషన్ రెడ్డితో కలిసి ప్రచారం చేస్తున్న భూపాల్ గౌడ్

**శంషాబాద్ అక్టోబర్23,ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు శంషాబాద్ మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్,కేంద్రమంత్రి కిషన్ రెడ్డితో కలిసి మునుగోడు ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.బిజెపి టిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీలు ప్రతిష్టా త్మకంగా భావిస్తున్న మునుగోడు ఉప ఎన్నికల సమరంలో అన్ని పార్టీల నాయకులు తమ వంతు ప్రచారం చేస్తూ ఎన్నికల వేడిని పుట్టించారు.ఈ నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నా యకుడు రాజగోపాల్ గౌడ్,కేంద్ర మంత్రితో కలిసి ఆదివారం పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు.

## దీపావళీ కొనుగోళ్లతో మార్కెట్ కిటకిట



ఘట్‌కేసర్‌లో దీపావళీ సామాగ్రీ అమ్మకాలు జరుపుతున్న దృశ్యం

**ఘట్‌కేసర్, అక్టోబర్ 23, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో దీపావళీ కొనుగోళ్లతో మార్కెట్ రద్దీగా మారింది. సోమవారం దీపావళీ సందర్భంగా ప్రజలు పండుగకు అవసరమైన అన్ని రకాల సామాగ్రిని కొనుగోలు చేస్తున్నారు. పట్టణంలో రహదారిపై పెద్ద సంఖ్యలో దుకాణాలు వెలిశాయి. పూజా సామాగ్రీ, బంతి, చామంతిపూలు, గుమ్మడికాయలు, బాణాసంచా, పండ్లు, బొమ్మలు, అరటికొమ్మలు, మామిడిఆకులు, మిఠాయి, వివిధ రకాల ప్రమిదల విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. పండుగ కొనుగోళ్లతో పట్టణమంతా కిటకిటలాడుతుంది. సోమవారం దీపావళీ సందర్భంగా ఇళ్లు, దుకాణాలకు, భవనాలకు రంగు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రజలు ఇళ్లలో శ్రీసత్యనారాయణస్వా మివ్రతాలు, లక్ష్మీదేవిపూజలు, కేదారగౌరీనోములను భక్తి, శ్రద్ధలతో నిర్వహిం చుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.

## గుర్తు తెలియని మహిళ దారుణ హత్య

**- సంఘటన స్థలాన్ని సందర్శిఇంచిన ఏసీపీ కుషాల్కర్**
**- రంగంలోకి దిగిన డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం**

**కొందుర్గు, అక్టోబర్ 23, (ప్రభాతవార్త) :** ఓ గుర్తు తెలియని మహిళ దారుణ హత్యకు గురైన సంఘటన మండల పరిధిలోని తంగళ్లపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై వెంకటేశ్వర్లు కథనం ప్రకారం కొందుర్గు పోలీస్ స్టేషన్ పరిధిలోని తంగళ్లపల్లి శివారులోని చించోడ్‌కు వెళ్లే దారి ప్రక్కల గల చెట్లల్లో ఓ మహిళను ఎక్కడో హత్య చేసి ప్లాస్టిక్ దాన సంచిలో మూట గట్టి ఇక్కడ పడవేసినట్లు ఉన్నదని ఎస్సై తెలిపారు. ఆదివారం ఉదయం వ్యవసాయ పొలాలకు వెళ్లిన వారు చూసి గ్రామ వీఆర్వో సత్యనారాయణకు తెలుపగా అతను తమకు సమాచారం ఇచ్చారని ఆయన చెప్పారు. మృతురాలు వయస్సు సుమారుగా 35 నుంచి 40 వరకు ఉంటుందని ఆమె ప్రక్కన గల బ్యాగ్‌లో చీర, లంగా, జాకెట్‌లతో పాటు ఈనెల 31వ తేదిన షాద్‌నగర్ నుంచి కొందుర్గు వరకు పరిగి డిపో బస్సులో ప్రయాణించినట్లు టికెట్ ఉందని ఎస్సై వివరించారు. ఇంకా మృతురాలు చామనచాయ రంగు, 5.7 ఎత్తు కలిగి ఉంటుందన్నారు. బ్లాక్ కలర్ నైటీ ధరించి ఉందన్నారు. ఎక్కడో ఆమె తలపై బలంగా కొట్టి చంపిన తర్వాత సంచిలో చుట్టుకొచ్చి పొదల్లో పారవేసి వెళ్లినట్లు అనుమానంగా ఉందని, ఆయన తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం షాద్‌నగర్ ఏసీపీ కుషాల్కర్ సంఘటన స్థలాన్ని సందర్శించారు. డాగ్ స్కాడ్, క్లూస్ టీంను రంగంలో దింపినట్లు ఎస్సై వివరించారు. ఆ గ్రామ వీఆర్ఏ సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు రూరల్ సీఐ సత్యనారాయణ పర్యావేక్షణలో ఎస్సై తెలిపారు. మృతురాలిని గుర్తు పట్టేందుకు షాద్‌నగరన కమ్యూనిటీ ఆసుపత్రిలో భద్రపర్చినట్లు ఎస్సై తెలిపారు.

## కొమురంభీం జయంతి.. ఘన నివాళి

**ఘట్‌కేసర్, అక్టోబర్ 23, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో ఆదివారం ప్రబు ద్ధభారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లడానికి 80వ వారం నిత్యపూలమాళ కార్యక్రమం నిర్వహించారు. పోచారం మున్సిపల్ టిఆర్ ఎస్‌పార్టీ నాయకులు బోయ పల్లి రాజేశ్వర్‌రెడ్డి, అన్నోజీగూడ సూర్య యూత్ అధ్యక్షులు జె.శరత్‌లు విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాళ వేసి నివాళులు అర్పించారు. పిబిఐ మేడ్చల్ జిల్లా సమన్వయకర్త ఎం.అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ సేవ లను గుర్తు చేసుకున్నారు. ఈసందర్భంగా అడవితల్లి ముద్దుబిడ్డ కొమురం భీం 121వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలదండ వేసి నివాళులు అర్పించారు. భూసా వ్యమ్యంపై బాణం ఎక్కు పెట్టిన కొమురం భీం అందించిన సేవలను కొనియాడారు. రాజ్యాంగపీఠికపై పిబిఐ సభ్యులు, నాయకులు ప్రమాణం చేశారు. ఈకార్యక్రమంలో అంబేద్కర్ యువ జన సంఘం అధ్యక్షులు మేకల దాసు, లోకేశ్‌రెడ్డి, రాజ్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, వినోద్, విశ్వా, శివ నర్సింహ్మా, రాందాస్, బాలయ్య, నారాయణ, వెంకటేశ్వరరావు, నర్సింగ్‌రావు, శ్రీనివాస్, నవీన్‌కుమార్, అనిల్‌కుమార్, మహిపాల్, గణేశ్, గండయ్య, మనీష్, విష్ణువర్ధన్, భరత్‌కుమార్, కేతన్ తదితరులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



ఎమ్మెల్యే సమక్షంలో టిఆర్ఎస్ చేరిన నాయకులు

## పలు పార్టీల నాయకులు టిఆర్ఎస్ చేరిక

**తలకొండల్లి అక్టోబర్22,ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టిఆర్ఎస్ పార్టీలో పలు పార్టీల నాయకులు చేరుతున్నారని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పేర్కొ న్నారు.ఆదివారం తలకొండపల్లి మండల పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్,బిజెపి పార్టీల ముఖ్యనేతలు సర్పంచ్ వరల క్ష్మీ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సమక్షం లో 50మంది టిఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ కార్యక్రమంలో ఆమనగల్ మా ర్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్ రెడ్డి,టిఆర్ఎస్ సీనియర్ నాయకులు సిఎల్ శ్రీనివాస్ యాదవ్,నాయకులు నరసింహ ఉన్నారు. పార్టీలో చేరిన వారు పబ్బతి జంగయ్య,పబ్బుతతి మల్లేష్, చెన్న య్య, రామస్వామి, శ్రీశైలం,రాజు,గిరి,మైసయ్య, సాలయ్య,బాలరాజు, లక్ష్మయ్య, దశరథం,శంకరయ్య, యాదిరెడ్డి, జంగయ్య ,శ్రీను, మహేష్, చెన్నకేశవులు, శ్రీనివాసులు,వెంకటయ్య,మైసయ్య,లక్ష్మణ్,చెన్నయ్య,కృష్ణయ్య,రాజు,గోపాల్, ఎల్లయ్య, జంగయ్య, బాలస్వామి, నరసింహ,బాలరాజు, శ్రీశైలం, రాములు,కృష్ణయ్య,బక్కయ్య,కాశయ్య,రామస్వామి చేరారు.

## గొర్రెల ,మేకల పెంపకందారుల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మల్లేష్

**తలకొండపల్లి అక్టోబర్23,ప్రభాతవార్త :** గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం తలకొండపల్లి మండల కమిటీ సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశానికి జిఎంపిఎస్ జిల్లా కార్యదర్శి అమీర్‌పేట మల్లేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ...రెండో విడత గొర్రెల పంపిణీలో గొర్రెలకు బదులు నగదు బదిలీ చేయాలని జిఎంపిఎస్ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేసిందని అన్నారు.ఫలితంగా మును గోడులో పైలట్ ప్రాజెక్టుగా గొల్ల కురుమల అకౌంట్లో నగదు బదిలీ వేయడం జరిగిందని దానికి సంతోషం వ్యక్తం చేస్తున్నామన్నారు.అక్కడే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా గొల్ల కురుముల అకౌంట్లో నగదు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.అదే విధంగా 50సంవత్సరాలు దాటిన ప్రతి గొర్రెల కాపరికి ఐదు వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన గొర్రెల కాపరికి పది లక్షల రూపాయలు ఎక్స్ షీయా ఇవ్వాలని పలు డిమాండ్‌లను చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీశైలం,జిల్లా కమిటీ సభ్యులు చిందం అంజయ్య,మండల కార్యదర్శి పెంటయ్య,అధ్యక్షుడు చిన్న మల్లయ్య, మండల కమిటీ సభ్యులు రాములు,తిరుపతయ్య,మల్లేష్‌లు, ఎస్.రామచంద్రయ్య,తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి చదువుకు జడ్పిటిసి చేయూత

**తలకొండపల్లి అక్టోబర్23,ప్రభాతవార్త :** కడ్తాల్ మండలం పెద్దవేము లోని భావితండాకు చెందిన రామావత్ లలిత రవీందర్ నాయక్ దంపతుల కుమార్తె ఉమేశ్వరి జాతీయ స్థాయిలో 2 ర్యాంక్ సాధిం చడంతో ముంబాయి ట్రిబుల్ ఐటిలో సిట్ వచ్చింది.ఉన్నత చదువులకు ఆర్థిక ఇబ్బందులతో సతమవుతున్నందున తావుర్య నాయక్ ద్వారా జడ్పిటిసి ఉప్పల వెంకటేష్‌ను కలిశారు.ఆయన వెంటనే స్పందించి తన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 10వేల రూపాయలను ఆర్థిక సహా యంగా అందజేశారు.ఈ సందర్భంగా ఉమ్మేశ్వరి తండ్రి రవీంద్ర నాయక్ ఉప్పల వెంకటేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వంశీ,శేఖర్,రాజు నాయక్,తావుర్య నాయక్,తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఉద్యమం

**సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎన్.బాలమల్లేశ్**



బాలమల్లేశ్ జాతీయ కౌన్సిల్ సభ్యునిగా ఎన్నికైన సందర్భంగా సన్మానించిన మూడుచింతలపల్లి మండల సిపిఐ కార్యదర్శి రాములుగౌడ్, పలువురు నాయకులు

**శామీర్‌పేట, అక్టోబరు 23, ప్రభాతవార్త :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను దేశవ్యాప్తంగ నిరసిస్తూ ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు,ఆ పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎన్.బాలమల్లేశ్ పార్టీ నాయకులకు సూచించారు. బాలమల్లేశ్ జాతీయ కౌన్సిల్ సభ్యునిగా ఎన్నికైనందుకు ఆదివారం మూడుచింతలపల్లి మండల సిపిఐ కార్యదర్శి టి. రాములుగౌడ్ కాప్రకు వెళ్లి ఆయనను సన్మానించారు. ఆయనతో పాటు పలువురు జిల్లా నాయకులు కూడ సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగ సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు,జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎన్.బాలమల్లేశ్ మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన 8ఏళ్లలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. అధికారంలోకి వస్తే విదేశాల్లో ఉన్న నల్లడబ్బును స్వదేశానికి తీసుకవచ్చి భారతదేశంలోని ప్రతి కుటుంబానికి 15లక్షల రూపాయలు జమ చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చటంలో విఫలమైందన్నారు. సంవత్సరానికి కోటి ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి విస్మరించారన్నారు. రానున్న కాలంలో బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగ ఆ విధానాలను నిరసిస్తూ సిపిఐ ప్రజాపోరాటాలు చేయాలని ఎన్.బాలమల్లేశ్ పిలుపునిచ్చారు. అక్టోబరు 14నుంచి 18వరకు సిపిఐ జాతీయ మహాసభలు జరిగినట్లు, ఈ 24వ మహాసభలో ఎన్.బాలమల్లేశ్ సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యునిగా ఎన్నిక కావటంతో మూడుచింతలపల్లి మండల సిపిఐ కార్యదర్శి టి.రాములుగౌడ్‌తో పాటు జిల్లా పార్టీ కార్యవర్గసభ్యులు టి.శంకర్, ఆర్.కృష్ణమూర్తి, కాప్ర మండల కార్యదర్శి డి.యాదగిరి, సిపిఐ కాలనీ కార్యదర్శి రాజేశ్వరి, సిపిఐ నాయకులు వెంకటేశ్‌యాదవ్, చంద్రయ్యలు పాల్గొని ఎన్.బాలమల్లేశ్‌ను ఘనంగ సన్మానించారు.

## తెలంగాణలో ఓపీఎస్ పథకం అమలు పర్చాలి

**శంకర్‌పల్లి, అక్టోబర్ 23, ప్రభాతవార్త :** తెలంగాణలో ఓపీఎస్ పథకం అమలు పర్చాలని రాష్ట్ర కాంట్రిబ్యూటరి పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షకార్యదర్శులు తాహేర్ అలీ, కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ మర్పల్లి ఆశోక్ తెలిపారు. తాజాగా పంజాబ్ ముఖ్యమంత్రి భగవత్ మాన్ ఓపీఎస్ విధానాన్ని అమోదిస్తున్నట్లు ప్రకటించడంతో దేశంలో రాజస్థాన్, ఛతీస్‌ఘాడ్, ఝార్ఖండ్, వెస్ట్ బెంగాల్ సహా మొత్తం ఐదు రాష్ట్రాల్లో ఓపీఎస్ విధానం అమలవుతుందని, తెలంగాణలో గ్రాటిటి, ఫ్యామిలీ పెన్షన్ అమలు చేస్తున్నట్లు ఓపీఎస్ విధానం సత్వరమే అమలు చేసి రాష్ట్రంలోని లక్ష డెబ్బై వేల ఉద్యోగ, ఉపాధ్యాయుల సామాజిక భద్రతను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే ఆధారపడి ఉందని పేర్కొనడం జరిగింది. కాగా 1 సెప్టెంబర్ 2004 నుండి రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన లక్షలామంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తించక వారి యొక్క కుటుంబాలు మనోవేధనకు గురవుతున్నాయని, కాబట్టి రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ విషయంపై వెంటనే స్పందించి రాష్ట్రంలో పాత పెన్షన్ విధానాన్ని అమలు పరిచి ఉద్యోగ ఉపాధ్యాయుల చిరకాల కోరికను తీర్చాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శ్రీను, మునీర్ పాషా, కార్యదర్శులు రాముశర్మ, వెంకటేష్, సుదర్శన్, శివకుమార్, వెంకటేష్, కృష్ణ, దేవేందర్‌రెడ్డి, సంజీవ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు

# పేద విద్యార్థులను సాయం అందించాలి

## -డిసిసి మాజీ అధ్యక్షుడు పడాల వెంకట్‌స్వామి

**చేవెళ్ల,అక్టోంబరు 23, ప్రభాతవార్త :** పేద విద్యార్ధులను సాయం అందించాలని రంగారెడ్డి జిల్లా డిసిసి మాజీ అధ్యక్షుడు పడాల వెంకట్‌స్వామి అన్నారు. అది వారం చేవెళ్ళ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలోని సుమా రు 200 మంది విద్యార్ధినులకు దుప్పట్లును రంగారెడ్డి జిల్లా డిసిసి మాజీ అధ్యక్షుడు పడాల వెంకట్‌స్వామి జన్మదినం సందర్భంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కస్తూర్బా రంగారెడ్డి జిల్లా డిసిసి మాజీ అధ్యక్షుడు పడాల వెంక ట్‌స్వామి మాట్లాడుతూ పేద విద్యార్ధులను అన్ని విదాలుగా అదుకునేందుకు నిరంతరం పాటుపడుతామన్నారు. విద్యార్ధులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. చదువుతోనే సమా జంలో విలువ గుర్తింపు ఉంటుందన్నారు. వసతి గృహం విద్యార్ధులను అదుకునేం దుకు దాతలు ముందుకు రావాలన్నారు. విద్యార్ధులకు విద్యతో పాటు వసతులు కూడ కల్పించేందుకు ఎల్లప్పుడు ముందుంటామన్నారు. రానున్న చలికాలం కావ దంతో విద్యార్ధులకు దుప్పట్లను అందజేసి కోంత వరకైన సహయం చేసినట్లువుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం సీనియర్ నాయకుడు సున్నపు వసం తం, చేవెళ్ళ సహకార సంఘం చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, ముడిమ్యాల సహకార సంఘం చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి,ఎంపిటిసి రాములు, సర్పంచ్ బండారి శైలజ ఆగిరెడ్డి,చేవెళ్ల మండల కాంగ్రేస్ పార్టీ అధ్యక్షురాలు దేవర సమతవెంకట్‌రెడ్డి ఉప సర్పంచ్ గంగియా దయ్య, మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి,సీనియర్ నాయ కుడు పడాల ప్రభాకర్, మదుసూదన్‌గుప్తా,శ్రీనివాస్‌గౌగ్, పెంటయ్యగౌడ్, యాలాల మహేశ్వర్‌రెడ్డి,పాండుయాదవ్,నారాయణదాస్, శేఖర్,మల్లారెడ్డి, మాణిక్యం, పడాల రాములు, బూర్ల సాయినాథ్, కోరే రాజు, జనార్దన్, వాజీద్, మాద వరెడ్డి, శ్రీశైలం, బండారు వెంకట్‌రెడ్డి,బూరాన్ ప్రభాకర్, బిజెపి నాయకులు శర్వలిం గం, అత్తిల్లి అనంతరెడ్డి, యూత్ కాంగ్రేస్ అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్,మాజీ ఉప సర్పంచ్ టెకులపల్లి శ్రీనివాస్, ఆగిరెడ్డి, రవీందర్‌రెడ్డి, దుర్గాప్రసాద్, బూ రాన్ సురేష్, పిఏసిఎస్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి, వార్డు మెంబర్‌లు ఇరమ్మెళ్ల మల్లేష్ తదితరులు పాల్గోన్నారు.


కస్తూర్బా గాంధీ విద్యాలయంలోని విద్యార్ధినులకు దుప్పట్లును వంపిణీ చేస్తున్న రంగారెడ్డి జిల్లా డిసిసి మాజీ అధ్యక్షుడు పడాల వెంకట్‌స్వామి


ఎన్నికైన అధ్యక్షులు వెంకటేశ్‌కు నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

### వడ్డెర కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడి ఎన్నిక ఏకగ్రీవం

**ఘట్‌కేసర్, అక్టోబర్ 23, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండల వడ్డెర కుల సంక్షేమ సంఘం అధ్యక్షులుగా శివరాత్రి వెంకటేశ్ ఎన్నిక అయ్యారు. ఘట్‌కేసర్ మున్సిపల్ మైసమ్మగుట్ట దేవస్థానం ఆవరణలో ఆదివారం వడ్డెర కుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా మాజీ అధ్యక్షులు బోదాసు వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి దేరంగుల ముత్యాలు తదితరులు హజరై నూతన కమిటీని ఎంపిక చేశారు. సమావేశంలో అందరి అభి ప్రాయాలను సేకరించి మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఘట్‌కేసర్ మండల వడ్డెర కుల సంక్షేమ సంఘం అధ్యక్షులుగా మర్రి పల్లిగూడకు చెందిన శివరాత్రి వెంకటేశ్ ఎన్నిక అయ్యారు. సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వరికుప్పల వెంకటేశ్, ఉపాధ్యక్షులుగా మ్యాగని నర్సింగ్‌రావు, ప్రధానకార్యదర్శిగా ఒర్సు బిక్షపతి, ఉపకార్యదర్శి మ్యా గని అంజనేయులులు ఎన్నిక అయ్యారు. ఈసందర్భంగా అధ్యక్షులు వెంకటేశ్‌తో పాటు నూతన కార్యవర్గాన్ని శాలువా, పూలదండలతో సన్మానించి అభినందించారు. వడ్డెర కులస్థుల సమస్యల పరిష్కారానికి, సంఘం బలోపేతానికి తన వంతు కృషి చేస్తామని తెలిపారు. నూతన అధ్యక్షులు వెంకటేశ్ అనుచరులు బాణాసంచా కాల్చి బ్యాండ్ మేళాలతో సందడి చేశారు. అనంతరం ఆయన ఘట్టుమైసమ్మ అమ్మవారిని దర్శిం చుకొని ప్రత్యేక పూజలు చేశారు.

### మునుగోడులో టిఆర్‌ఎస్‌దే గెలుపు

**జడ్పిచైర్మన్ సునీతరెడ్డి**


మునుగోడు ప్రచారంలో పాల్గొన్న జడ్పిచైర్మన్,మంత్రి,తదితరులు

**శంషాబాద్ అక్టోబర్23,ప్రభాతవార్త :** నల్గొండ జిల్లాలోని మునుగోడు శాసనసభ నియోజకవర్గానికి జరుగుతున్న ఉప ఎన్నికల్లో టిఆర్‌ఎస్ పార్టీ ఘనవిజయం సాధిస్తుందని వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ ప ట్నం సునీత మహేందర్ రెడ్డి,టిఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు దీపా మల్లేష్ పేర్కొన్నారు.ఆదివారం మునుగోడు నియోజకవర్గంలోని పలు గ్రామాలలో వారు ప్రచారం నిర్వహించారు.టిఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో ఎక్కడా లేనివిధంగా అనేక సం క్షేమ కార్యక్రమాలతో పాటు అభివృద్ధిని కూడా పరుగులు పెట్టిస్తున్న ఘనత ముఖ్యమంత్రి కెసిఆర్‌కే దక్కుతుందని వారు పేర్కొన్నారు. విజ్ఞులైన మునుగోడు ఓటర్లు కారు గుర్తుకు ఓటు వేసి టిఆర్‌ఎస్ అభ్య ర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డిని గెలిపించాలని కోరారు.

### టిఆర్‌ఎస్ పార్టీతోనే సంక్షేమ పథకాలు

**తోట రాములు ముదిరాజ్**

**శంషాబాద్ అక్టోబర్23,ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో టిఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉంటేనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని శంషాబాద్ మున్సిపల్ టిఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు తోట రాములు ముదిరాజ్ పేర్కొన్నారు.గతంలో అధికారంలో ఉన్న ఏ పార్టీ కూడా చేపట్టలేని సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రవేశపెట్టి విజయవంతంగా నడుపుతున్నారని అన్నారు.వృద్ధులకు విక లాంగులు ఒంటరి మహిళలకు దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆసరా పెన్షన్లు అందజేస్తూ వారి ఇంటిలో ఒక సభ్యుడుగా ఉన్నారని అన్నారు. రైతులకు 24గంటల పాటు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్న ఘనత టిఆర్‌ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందని తోట రాములు ముదిరాజ్ స్పష్టం చేశారు.కళ్యాణలక్ష్మీ ,షాదిముబారాక్ పథకాల ద్వారా లక్షలాది మంది ఆడపిల్లల పెళ్లిలు తల్లిదండ్రులకు భారం కాకుండా చేస్తున్నారని వారి దీవెనలు ఆశీర్వాదంతో మునుగోడులో టిఆర్‌ఎస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఆయన పేర్కొన్నారు.

### గౌడ ఆత్మీయ సమ్మేళనానికి తరలిన నాయకులు


గౌడ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఎమ్మెల్యే, నాయకులు

**శంషాబాద్ అక్టోబర్23,ప్రభాతవార్త :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లో నిర్వహించిన గౌడ సమ్మేళనానికి శంషాబాద్ నుండి గౌడ సంఘం నాయకులు పెద్ద ఎత్తున్న తరలివెళ్లారు.మునుగోడు నియోజకవర్గానికి సంబంధించిన నగర శివారులలో నివసిస్తున్న గౌడ కులస్తులతో టిఆర్ ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళానికి శంషాబాద్ నుండి పలువురు తరలివెళ్లారు.రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌తో పాటు మండల టిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కొడిగంటి చంద్రారెడ్డి,మున్సిపల్ టిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు నార్సింగ్ మార్కెట్ కమిటీ చైర్మన్ దూడల వెంకటేష్ గౌడ్,చిన్న గోల్కొండ సింగిల్ విండో చైర్మన్ దవణాకర్ గౌడ్,పార్టీ నాయకులు పెదిరిపాటి ప్రవీణ్ గౌడ్,పారేపల్లి శ్రీనివాస్ గౌడ్, ఆనగోనే శ్రీకాంత్ గౌడ్,నందిగామ రాజశేఖర్ గౌడ్,కమ్మదనం దేవేందర్ గౌడ్,మంచర్ల మోహన్ రావు,తదితరులు పాల్గొన్నారు.

### భారత్ జోడో యాత్రకు తరలిన మండల నాయకులు

**జిల్లెడు చౌదరిగూడ, అక్టోబర్ 23,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం ఆ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో పాదయాత్రకు తరలి వెల్లారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు మాట్లాడుతూ భారత్ జోడో యాత్రలో మండలం నుంచి వందల సంఖ్యలో పాల్గొన్నట్లు ఆయన పెర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ రాబోయే రోజుల్లో అధికారంలోకి రావడం ఖాయమని ఆయన తెలిపారు. రాహుల్ గాంధీ చేపట్టిన యాత్రకు విశేష స్పందన ఉందని అన్నారు. ఈ కార్యమంలో ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ బీసి సెల్ మండల అధ్యక్షుడు వెంకట్ రాములు, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు వెంకటనర్సిం హారెడ్డి, నాయకులు గిదిధర్ గోపాల్, శ్రీనివాస్, హసన్, ఎల్లేశ్వర్, నర్సిం హులు తదితరులు ఉన్నారు.


భారత్ జోడో యాత్రలో పాల్గొన్న చలివేంద్రంపల్లి రాజు

### మంత్రి కెటిఆర్‌ను కలిసిన ప్రముఖులు


మునుగోడులో ఆదివారం జరిగిన గౌడ ఆత్మీయ సమ్మేళనంలో టిఆర్‌ఎస్ వర్కిం గ్ ప్రెసిడెంట్, మంత్రి కెటిఆర్‌ను కలిసిన చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం, చిత్రంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ **(చేవెళ్ల - ప్రభాతవార్త)**

### ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

ఈ దీపావళి పర్వదినం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు ఆకాంక్షించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. చీకటిని పారద్రోలి వెలుగునిచ్చే దీపావళి పర్వదినం ప్రజలకు అంత మంచి జరగాలన్నారు. దీపావళి పర్వదినాన్ని వేడుకగా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలన్నారు. చిన్న పిల్లలు, కాకరొత్తులు కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచిం చారు. లక్ష్మీనారాయణుని అనుగ్రహంతో అదరికి శుభం చేకూరాలని.. సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.

### ప్రతిభ చాటిన గిరిజన విద్యార్థులకు సన్మానం

**జహీరాబాద్, అక్టోబరు 23, ప్రభాతవార్త:** చదువులో ప్రతిభ చాటిన గిరిజన విద్యార్థులను టిబేస్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానిం చారు. పట్టణంలో ఇన బంజారా భవన్‌లో నిర్వహించిన సన్మాన కార్య క్రమానికి ఆయా రంగాలకు చెందిన అతిరథులు హాజరై విద్యార్థులను అభినందించారు. ఇటీవల ఐఐటి, నీట్, త్రిబుల్ ఐటిలో ప్రవేశాలు పొందిన, పిహెచ్‌డి పట్టా అందుకున్న గిరిజన యువతను ఘనంగా సన్మానించారు. టిబేస్ జహీరాబాద్ డివిజన్ అధ్యక్షులు తుకారామ్ చౌహాన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి హన్మంత్ పవార్, గౌరవ అధ్యక్షులు హీరరు రాథోడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసీరామ్ రాథోడ్, సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అర్జున్ చౌహాన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శ్రీనివాస్ బానోత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవి సింగ్ రాథోడ్, రమేష్ బానో త్, హీరాలాల్ చౌహాన్, డాక్టర్ సునీల్‌కుమార్, న్యాల్‌కల్ మండల ఎంఇఓ మారుతి రాథోడ్, పిఎసిఎస్ చైర్మన్ కిషన్ రావు పవార్, శ్రీ సేవాలాల్ బంజారా సొసైటీ అధ్యక్షులు మోతిరామ్ రాథోడ్, సమాజ సేవకులు డాక్టర్ వెంకటేశం గుప్తా, టిబేస్ నాయకులు హీరాలాల్ పవార్, రామ్‌సింగ్ రాథోడ్ తదితరులు హాజరై ప్రతిభ చాటిన విద్యార్థులు విశాల్ పవార్, నందిని బానోత్, రాజేశ్వరి రాథోడ్, పి మహేశ్వరి, ఆరాధ్య పవార్, రాహుల్ పవార్, వెంకటేశ్, ఆర్ సంగీత, శివనంద్ పవార్, డాక్టర్ రవీందర్ బానోత్‌లను ఘనంగా సన్మానించారు.

### ఘనంగా (దొంతులు) బొమ్మల కొలువు వేడుకలు

**కొడిపల్లి, అక్టోబర్ 23, ప్రభాతవార్త:**

దేశ వ్యాప్తంగా నరకాసుర సంహారణ జరిగిన రోజున దీపావళి పండు గను అత్యాంత్య వైభవంగా జరుపుకోవడానికి ముందు రోజు ధంతేరసు సందర్భంగా రాష్ట్రంలో ఆనందోత్సవాలతో అత్యాంత్య ఘనంగా నిర్వ హించుకోనే(దొంతుల కొలువు) బొమ్మల కొలువు వేడుకలను ఆది వారం ఘనంగా జరుపు కున్నారు. ఉదయం నుండి ఇంటి ఆడపడుచులు నూతన వస్త్రాలను ధరించి, మార్కెట్‌లో లభించే వివిధ రకాల బొమ్మ లను కొనుగోలు చేయడమే కాకుండా, కుటుంబ ఆడ పడుచుకు తల్లి దండ్రులు, మేనత్తలు ఇచ్చిన దొంతులతో పాటు ప్రతి యేట ఒక జత దొంతులను అందంగా పెర్చుకుని, మధ్యలో విఘ్నేశ్వర, లక్ష్మి విగ్రహా లన్ని ఉంచి, నగలతో వైభవంగా అలంకరించారు. సాయంత్రం సమ యంలో లక్ష్మి దేవత పారాయణం చేసి, ప్రత్యేక పూజలు జరిపి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. దొం తుల కొలువు ద్వారా పుట్టిన ఇల్లు నిర్వంతరం సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకొంటారు. పూజలు చేసిన పిదప అమ్మవారికి నెయ్యితో తయారు చేసిన తీపి వంటలను ప్రసాదంగా సమర్పించి, వేడుకలను ఆనందోత్స వాల నడుమ జరుపుకున్నారు. కొడిపల్లి గ్రామంతో పాటు చుట్టు ప్రక్కల ఉన్న గ్రామాలలో తమ స్థాయికి తగ్గటుగా ఆడపడుచులు బోమ్మల కొలువు పూజలు నిర్వహించారు. పూజా నంతరం ఐదు మంది ముత్తైదు మహిళలకు వాయినం అందించి, ఆశీర్వాదం తీసు కోవడం చేస్తారు. బొమ్మల కొలువు (దొంతుల కొలువు) పూజలు చేసుకున్న వారిలో మండల కేంద్రమైన కొడిపల్లిలోని పలువురు వ్యాపారస్థులు, మట్ట నీరజ లతోపాటు పలువురు ఆడపడుచులు కలరు.

### భక్తులతో కిటకిటలాడిన ఏడుపాయాల

**పాపన్నపేట, అక్టోబరు 23, ప్రభాతవార్త:**

భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న ఏడు పాయల వనదుర్గా భవాని మాత ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. ఆదివారం సెలవు రోజు కావడం తో ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని అమ్మ దర్శ నం చేసుకున్నారు. మంజీరా ప్రాజెక్టు నుంచి విడుదల చేసిన నీరు ఆలయం ముం దు నుంచి ధారగా ప్రవహిస్తుండటంతో అమ్మవారి పూజలు రాజగోపురంలోని ఉత్స త విగ్రహానికి నిర్వహిస్తున్న విషయం భక్తులకు విధితమే. ఆలయానికి చేరుకున్న భక్తులు మంజీరాలో పుణ్యస్నానాలు ఆచరించి ఆర్చ కులు వేద మంత్రాలు వల్లిస్తుం డగా పూజా కార్యక్ర మాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తు లకు అమ్మవారి దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటి చైర్మన్ బాలాగౌడ్, ఆలయ ఇఓసార శ్రీనివాస్‌లు ఆలయసిబ్బందితో కలిసి తగుజా గ్రత్తలు తీసుకుంటున్నారు. ఆలయం ముందు నుంచి ప్రవహిస్తున్న మంజీరా పరవళ్ల ను భక్తులు ఆస్వాదిస్తూ ఆనందం చెందుతున్నారు. ఆలయానికి చేరుకున్న భక్తులు అమ్మవారిని దర్శించుకుని క్షేమంగా తమ తమ ఊర్లకు పయనమయ్యే వరకు ఎస్ఐ విజయ్‌కుమార్ తన సిబ్బందితో తగు ఏర్పాట్లు చేశారు.

### రైతు హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శిగా అభిషేక్‌రెడ్డి


తెలంగాణ రైతు హక్కుల సాధన సమితి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా చేవెళ్ల గ్రామానికి చేందిన అల్లాడ అభిషేక్‌రెడ్డిని నియమిస్తు నియమక పత్రంను అందజేస్తున్న రాష్ట్ర రైతు హక్కుల సాధన సమితి అధ్యక్షుడు బాలుయాదవ్, వర్కింగ్ అధ్యక్షుడు తలారి శ్రీనివాసులు **(చేవెళ్ల - ప్రభాతవార్త)**

తల్లీకూతురు ఆత్మహత్య కేసులో...

### నలుగురు నిందితుల రిమాండ్

**జహీరాబాద్, అక్టోబరు 23, ప్రభాతవార్త:** అదనపు కట్నం వేధింపు లతో ఏడాది కుమార్తెతో కలిసి బావిలో దూకి తల్లి ఆత్మహత్య చేసుకున్న సంఘటనలో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డిఎస్‌పి వి రఘు తెలిపారు. నియోజకవర్గంలోని మండల కేంద్రమైన మొగుడంపల్లి గ్రామానికి చెందిన వివాహిత అంబిక అదనపు కట్నం కోసం అత్తారింటి వేదింపులు భరించలేక ఏడాది పసిపాప నక్షత్ర తో కలిసి ఆత్మహత్య చేసుకున్న విషయం పాఠకులకు విధితమే. అందు లో భాగంగా అంబికను అదనపు కట్నం కోసం వేదిస్తున్న భర్త సతీష్ గౌడ్, అత్త పుణ్యవతి, మాత కిష్టయ్యగౌడ్, ఆడపడుచు భాగ్యశ్రీలను రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు డిఎస్‌పి వివరించారు.

### కుటుంబ సమస్యలతో యువకుడి ఆత్మహత్య

**రామాయంపేట మున్సిపాలిటీ, అక్టోబర్ 23, ప్రభాతవార్త :**

కుటుంబ సమస్యలతో చెట్టుకు ఉరివేసుకొని ఓయువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన రామాయంపేట మండలం ఆర్.వెంకటాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ రాజేష్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కేదరి నర్సింలు కుమారుడైన కేదరి వినీత్ (24) ఎలక్ట్రిషన్ పని చేస్తూ జీవిస్తున్నాడు. కుటుంబ సమస్యలతో శనివారం నాడు రాత్రి 10 గంటల సమయంలో ఇంటినుంచి బయటికి వెళ్లి ఆదివారం నాడు ఉదయం 6.30 గంటలకు వారి వ్యవసాయ పొలం లో వేప చెట్టుకు తనకు తానుగా ఉరి వేసుకొని చనిపోయి కనిపించినట్లు మృతుని తండ్రి కేదరి నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

**వర్గల్, అక్టోబర్ 23 (ప్రభాతవార్త):** అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన వర్గల్ మండలం తున్కిఖాల్సా గ్రామ శివారు లోని హల్దీవాగులో ఆదివారం లభ్యమైంది. ఈ సంఘటనకు సంబం ధించి గౌరారం ఎస్ఐ సంపత్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అంబర్‌పేట గ్రామానికి చెందిన అల్లాపురం సాయిలు(52) కొద్ది రోజు లుగా అంబర్‌పేట గ్రామ శివారులో సీతాఫలాలు తెం పుకొని అమ్ము కుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇందులో భాగంగా గత పది రోజుల క్రితం సీతాఫల్ కాయల కొరకు వెళ్ళి తిరిగి రాలేదు. ఇదిలా ఉండగా తున్కి ఖాల్సా గ్రామానికి చెందిన పులిగారి శ్రీనివాస్‌రెడ్డికి సంబంధించిన దూడ చనిపో వడంతో గ్రామ శివారులో వేయడానికి వెళ్ళగా శివారు ప్రాంతంలో ఉన్న హల్దీవా గులో గుర్తుతెలియని మృతదేహం కనిపించడం తో అంబర్‌పేట గ్రామస్తులకు ఈ విషయాన్ని తెలుపగా అక్కడికి చేరుకున్న గ్రామస్తులు అంబర్‌పేట గ్రామానికి చెం దిన సాయిలుగా గుర్తించారు. మృతునికి భార్యతో పాటు ఒక కూతురు ఉన్నారు. మృతుని అన్న కుమారుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంపత్‌కుమార్ తెలిపారు.

### ఘనంగా "జాతీయ ఆయుర్వేద దినోత్సవం"

**కంగ్టి, అక్టోబర్ 23, ప్రభాతవార్త:** మండలపరిధిలోని కస్తూర్బా గాంధీ వసతి గృహంలో ఆదివారం "జాతీయ ఆయుర్వేద దినోత్సవం" సంద ర్భంగా ఎంపీపీ సం గీతవెంకట్‌రెడ్డి, ఉప ఎంపీపీ రేఖ పాటిల్, ఆయుష్ ఆయుర్వేద డాక్టర్ నారాయ ణరావు చేతుల మీదుగా విద్యార్థినీలకు ఆయుష్ ఆరోగ్య కరదీపికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు ఆయుర్వేద పితామహుడు ధన్వంతరి జయంతి సందర్భంగా "జాతీయ ఆయుర్వేద దినోత్సవం" ప్రతి ఏటా జరుపు కుంటారు. కేంద్ర ప్రభుత్వం 2016 సంవత్సరం నుండి జాతీయ ఆయు ర్వేద దినోత్సవం నిర్వహిస్తుంది. ఆయుర్వేద అతి ప్రచీనమైన, పురా తన, సనాతనమైన, నిత్యనూతనమైన సకల వైద్య విధానాములకు మూలమైన సంపూర్ణ వైద్యమే ఆయుర్వేదం అని పేర్కొన్నారు. ఆయువు అంటే శరీరం, ఇంద్రియాలు, మనస్సు, ఆత్మల కలయిక వీటినే ఆయు ర్వేదం అని అంటారన్నారు. ఆయుర్వేద చికిత్స విధా నం, రోగ చికిత్స ఎంతో ముఖ్యమో, ఆరోగ్య పరిరక్షణ కూడా ఎంతో ముఖ్యమని వారు విద్యార్థినీలకు సూచించారు. అదేవిధంగా "ఆయుష్" అనగా ఐదు సంప్ర దాయల వైద్య విధానాల సమహారం అని ఆయుర్వేదం, యునాని, పకృతివైద్యం, హోమియోపతి, యోగ ల కలయికే ఆయుష్ అని వారు డాక్టర్ నారాయణ రావు తెలిపారు. అంతకుముందు ధన్వంతరి చిత్రపటానికి పూలమాలలు వేశారు.

### జాతీయస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన మమత

**కంగ్టి, అక్టోబర్ 23, ప్రభాతవార్త:** మండల పరిధిలోని రాజారాం తాండకు చెందిన విద్యార్థిని మతుర మమత ఆదివారం జాతీయ స్థాయి ఖోఖో, వాలీబాల్ క్రీడా పోటీలకు ఎంపికైంది. మమత ఎంపికకావడంతో ఆమె తల్లిదండ్రులు, గ్రామస్థు లు ఆనందం వ్యక్తం చేశారు. మమత చిన్ననాటి నుండి రాజారాం తాండలోని ప్రాథమిక పాఠశాలలో విద్యాభ్యాసం చేసి, జహీరాబాద్ మండలం టీఎస్‌డబ్ల్యూ ఆర్ఎస్ (గర్ల్స్) హోతి (కె) లో ప్రస్తుతం పదవతరగతి అభ్యసిస్తుంది. ఈ సందర్భం గా తల్లిదండ్రులు, గ్రామస్థులు మమత జాతీయ స్థాయిక్రీడా పోటీల్లో రాణించి మండలానికి పేరు ప్రతిష్టాలు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు,విద్యార్థులను మమతకు అభినందనాలు తెలిపారు.


వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు, చిత్రంలో సర్పంచ్ కావేరి

### ఉచిత వైద్య శిబిరంలో 200 మందికి వైద్యసేవలు

**ఘట్‌కేసర్ రూరల్, అక్టోబర్ 23, ప్రభాత వార్త:** మండలంలోని అవుశాపూర్ గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు గ్రామ సర్పంచ్ ఏనుగు కావేరి తెలిపారు. నగ రానికి చెందిన నేచురల్ ఫౌండేషన్ లైఫ్ ఆధ్వర్యంలో నిర్వహిం చిన ఉచిత వైద్య శిబిరంలో రోగులకు సాధారణ వైద్య పరీక్షలతో పాటు కంటి, ఎముకలు, గుండె, బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించి అవసరమైనటు వంటి వారికి వైద్య పరీక్షలు నిర్వహిం చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌తో పాటు బీజేపీ నాయకులు ఏనుగు మశ్చేందర్ రెడ్డి, స్థానిక పంచాయతీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

### నేటి సదర్ ఉత్సవానికి ఏర్పాట్లు


ఘట్‌కేసర్‌లో దున్నతో విన్యాసాలు చేయిస్తున్న సుధాకర్

**ఘట్‌కేసర్, అక్టోబర్ 23, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో సోమవారం నిర్వహించనున్న సదర్ ఉత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. యా దవ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో వాసవీ టవర్స్ వద్ద దీపావళీ సందర్భంగా సదర్ వేడుకలు నిర్వహి స్తున్నారు. ఈసందర్భంగా పట్టణంలోని హనుమాన్‌నగర్ నుంచి దున్నలను అలంకరించి బ్యాండ్‌మేళాలతో మున్సిపల్ కారా ్యలయం, ఎదులాబాద్‌రోడ్డు మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు ఊరే గింపు నిర్వహిస్తామని తెలిపారు. ఈసందర్భంగా హనుమాన్‌నగర్‌లో బైర సుధాకర్ దున్నపోతలతో విన్యాసాలు చేయించి సదర్ వేడుకలకు సిద్దం చేయిస్తున్నారు. ప్రతియేటా ఇక్కడ సదర్ ఉత్స వాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు యాదవ సంఘం నాయకులు తెలిపారు.

### మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**తలకొండపల్లి అక్టోబర్23,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల చుక్కాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎడెల్లికి చెందిన పుట్టా రాము లమ్మ మరణించారు. ఈ విషయం సర్పంచ్ దాసరి కిష్టయ్య ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెలియజేయడంతో మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయంగా 5వేల రూపాయలను భర్త సాయిలుకు అందజేశారు.ఈ కార్యక్ర మంలో సర్పంచ్ కిష్టయ్య,ఉప సర్పంచ్ జక్కు శ్రీనివాస్ రెడ్డి,గౌరి పల్లి సర్పంచ్ అనురాధ నరేందర్ గౌడ్,మాజీ ఎంపిటిసి దాసరి యాదయ్య,ఐక్యత ఫౌండేషన్ సభ్యులు నూనె రాఘవేందర్ సత్యం చంద్రశేఖర్ మల్లయ్య,రమేష్,పెద్దలు వెంకట య్య,శేఖర్ రెడ్డి, పర్వతాలు లింగయ్య,రాఘవేందర్ రెడ్డి,మల్లయ్య, యువకులు తదితరులు పాల్గొన్నారు.

### బాణసంచా దుకాణాదారులు జాగ్రత్తలు పాటించాలి

**షాబాద్ సీఐ గురువయ్యగౌడ్**

**షాబాద్, అక్టోబర్ 23, ప్రభాతవార్త :** బాణసంచా (క్రాకర్స్ స్టాల్స్) ఏర్పాటు చేసిన నిర్వాహకులు తగిన జాగ్రత్తలు పాటించా లని షాబాద్ సీఐ గురువయ్యగౌడ్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ....దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా క్రాకర్స్ స్టాల్స్ ఏర్పాటు చేసిన నిర్వా హకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి దుకాణం ముందు ఇసుక బకెట్‌లు, వాటర్ డ్రమ్ము, ఫైర్ సేఫ్టీ సిలిండర్ పెట్టుకోవాలన్నారు. దుకాణాలకు, దుకాణాలకు మధ్య దూరం పాటించాలని, అగ్ని ప్రమాదం జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అందరూ ఇంటివద్ద జాగ్రత్తలు పాటిస్తూ, పిల్లలు తల్లిదండ్రుల, పెద్దల సమక్షంలోనే టపాసులు కాల్చుకోవాలన్నారు.ప్రతి ఒక్కరు దీపావళిని ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరుకుంటూ ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

### అయుర్వేదంతో సంపూర్ణ ఆరోగ్యం

**సిద్దిపేట రూరల్, అక్టోబర్ 23, ప్రభాతవార్త :**

భారతదేశ సనాతన ధర్మం ఈ ప్రపంచానికి అందించిన నాలుగు వేదాల్లో అయుర్వేదాన్ని ఒక ఉప వేదంగా పరిగణించిబ డుతుందని ఈ అయుర్వేదం దా ్వరా అయువృద్ధి జరుగుతుందని పతంజలి యోగ సమితి జిల్లా సహ ప్రభారి అయుర్వేద వైద్యులు గంజి జనార్ధన్ అన్నారు. అదివారం 7వ అయుర్వేద దినోత్స వాన్ని పురస్కరించుకొని పతాంజలి యోగ సమితి జిల్లా కమిటీ అధ్వర ్యంలో జిల్లా కార్యాలయంలో ధన్వంతరి చిత్ర పటా నికి పూలమాలలు వేసి అయుర్వేద దినోత్సం ఘనంగా నిర్వహిం చారు.పతాంజలి జిల్లా ప్రభారి పెద్ది మనోహర్, సింగోజు మురళీకృష్ణ అచార్యులు, బిర్కూరి మనోహర్ పాల్గొన్నారు.

### మర్కుక్‌లో...

**మర్కుక్, అక్టోబర్ 23 (ప్రభాతవార్త):** ధన్వంతరిస్వామి జయంతి సందర్భంగా మండల పరిధిలోని పాములపర్తి గ్రామంలో మండల నాయిబ్రాహ్మణ ఐక్యత సమితి ఆధ్వర్యంలో ధన్వంత రిస్వామి చిత్రపటా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల నాయిబ్రాహ్మణ ఐక్యత సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కొత్వాల్ రాజు మాట్లాడుతూ ధన్వంతరిస్వామి మా కుల దైవమని, ఆయన జయంతి ఉత్సవానికి నాయిబ్రాహ్మణులు హాజరుకావడం సంతోషంగా ఉందన్నారు.కార్యక్రమంలో స్వామి, రాజు, శంకర్, నవీన్, గురువయ్య, రమేష్ పాల్గొన్నారు.

### నిబంధనల పేరుతో వసూళ్ల పర్వం...!

**సంగారెడ్డి బ్యూరో అక్టోబరు 23,ప్రభాతవార్త:**

సంగారెడ్డి మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు, ఆరో పణలకు తావిస్తున్నాయి. అధికారాన్ని అడ్డంపెట్టుకొని కొందరు వసూళ్ల కు పాల్పడుతున్నారని, వారు చెప్పినంత ఇవ్వకపోతే, నిభంధనలపేరుతో కూల్చి వేతకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. శనివారం సంగారెడ్డి మున్సి పల్ పరిధిలోని 11వార్డు, 12వవార్డు, 8,వార్డులలో, 30, 33వ వార్డులలో ఆరు అక్రమ నిర్మాణాలను కూల్చివేసినట్లు శనివారం మున్సిపల్ కమిషనర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంగారెడ్డి మున్సిపల్ పరిధిలో పదుల సం ఖ్యలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా, పట్టించు కోని అధికా రులు, కొన్ని వార్డులలో మాత్రమే కూల్చివేతలకు పాల్పడటం చర్చనీయం శమైంది. 12 వార్డులో అక్రమంగా సెల్లార్ నిర్మాణం చేపట్టారని శనివారం అధికారులు డిటి ఎఫ్ ఆధ్వర్యంలో కొంత భాగాన్ని కూల్చి వేశారు. ఇంటి నిర్మాణానికి అను మతులు తీసుకున్నామని, సెల్లార్ కు తీసుకోలేదని, దానికి అవసమైన జరిమాన కట్ట దానికి సిద్దంగా ఉన్న ప్ప టికి, అవేవి పట్టించు కోకుండా నిర్మా ణాలను తొలిగించారని ఇంటి యజ మాని పేర్కొన్నారు. సంగారెడ్డి మొత్తం లో నా ఒక్క నిదే సెల్లార్‌లేదని, ఇంకా చాల ఉన్నాయని అయినా వాటిని పట్టించుకోకుండా, సెల్లార్‌కు అనుమతులు లేవంటూ, నిర్మాణాలను తొలిగిం చారని ఇంటి యజమాని వాపోయాడు. మున్సిపల్ పరిధిలో కొందరు ప్రజాప్రతినిధులు వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. తమ పరిధిలోని వార్డు కాక పోయినప్పటికి డబ్బులు డిమాండ్‌చేస్తున్నారనే ఆరో పణలున్నాయి. మేము ఇంత మందిమి ఉన్నాము మాకు వచ్చి ఎప్పడు కలు స్తావు, లేదంటే నీఇంటి నిర్మాణంపై ఫిర్యాదు చేస్తున్నాం అంటూ బెదిరింపు లకు పాల్ప డుతున్నట్లు ఆరోపణలున్నాయి. వారు చెప్పనంత ఇవ్వకుంటే నిభంధనల పేరుతో, కూల్చివేతలకు పాల్పడుతున్నారని ఆరోపణలు న్నాయి. అక్రమ నిర్మాణాలపట్ల పెద్దగా శ్రద్ధచూపని మున్సిపల్ అధికారులు, కొందరు ప్రజాప్రతినిధుల చేసే, పిర్యాదులపై వెంటనే స్పందిస్తున్నారనే ఆరో పణలున్నాయి. మున్సిపల్ కార్యాలయంలో పని చేసే కొందరు ఔట్ సోర్సింగ్ సిబ్బంది అందిన కాడికి దోచుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.



